క్లుప్తంగా

రేపు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన

యద్దనపూడి: మండలంలోని గన్నవరం–మార్టూరు దండుదారి వద్ద వేంచేసి ఉన్న గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం 7వ తేది బుధవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళగిరి వీరాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామివారికి సుప్రభాతం, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహిస్తామన్నారు. 11 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం ఉంటుందని పరిసర గ్రామాల ప్రజలు స్వామివారి పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా ఆయన కోరారు.

నాగులపాలెంలో గడ్డివామి దగ్ధం



తగులబడుతున్న వామి

పర్చూరు(చినగంజాం): మండలంలోని నాగులపాలెం గ్రామంలోని సాధినేని సాంబయ్యకు చెందిన గడ్డివామి అగ్నికి ఆహుతయ్యింది. సోమవారం మధ్యాహ్న సమయంలో గడ్డివామిలో నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో చుట్టు పక్కల వారందరూ పరుగులు తీశారు. సమాచారం అందుకున్న చీరాల అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మంటలను పూర్తిగా ఆర్పివేశారు. గడ్డి వామి తగులబడటానికి కారణాలు తెలియాల్సి ఉంది. కాలిన గడ్డివామి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని అంచనా వేశారు.

ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శిగా శ్రీనివాసరావు



తమ్మన శ్రీనివాసరావు

అద్దంకి రూరల్: ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శిగా అద్దంకికి చెందిన తమ్మన శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. 2024–26 సంవత్సరానికి నూతన కమిటీ నియామకంలో ఎన్నిక నిర్వహించారన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు చిన్నిరామ సత్యనారాయణ నుంచి సోమవారం నియామకపత్రం అందుకున్నట్లు తమ్మన తెలిపారు. సంఘ అభివృద్ధికి కృషిచేస్తానని వివరించారు.

భక్తిశ్రద్ధలతో సోపిరాల పోలేరమ్మ తిరునాళ్లు



మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి వస్తున్న భక్తులు

చినగంజాం: మండలంలోని సోపిరాల గ్రామ దేవత పోలేరమ్మ తిరునాళ్ల మహోత్సవం రెండో రోజు కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవత కోసం గ్రామంలోని భక్తులు సద్దులు వెంట తీసుకొని ఆలయ ప్రాంగణానికి మేళతాళాలతో, డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా నడచి వెళ్లారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి తమ మొక్కులను తీర్చుకున్నారు. సాయంత్రం ధర్మతేజ ఈవెంట్స్ వారిచే డూప్ హీరోలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యార్థినికి ప్రోత్సాహక బహుమతి



దివ్యశ్రీకి నగదు బహుమతి అందిస్తున్న దాత

వేటపాలెం: పదిలో సత్తా చాటిన విద్యార్థినికి నగదు పురస్కారం అందించారు. ప్రభుత్వ హైస్కూల్‌లో చదివిన సజ్జా దివ్యశ్రీ పదిలో 596 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచినందుకు పూర్వవిద్యార్థికి నగదు ప్రోత్సాహకం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థి శివనాగ కిషోర్ మాట్లాడుతూ తానూ పందిళ్లపల్లి హైస్కూల్‌లో చదివానని, చదువుల్లో రాణిస్తున్న విద్యార్థులను ప్రోత్సాహం అందించడానికి నగదు బహుతులు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం శేఖరరావు, ఉమ్మిటి వేణుగోపాలరావు, గుంటూరు శివశవ శంకర్, బండ్ల శ్రీను, పాల్గొన్నారు.

12న మండల సర్వసభ్య సమావేశం

అద్దంకిరూరల్: ఈనెల 12న అద్దంకి మండల సర్వసభ్య సమావేశం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సోమవారం సింగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

పచ్చిరొట్ట.. పోషకాల దిట్ట

- పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెంపు
- రాయితీపై రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు
- సద్వినియోగం చేసుకోవాలంటున్న వ్యవసాయ శాఖ అధికారులు
- మండలానికి 80 క్వింటాళ్ల కేటాయింపు



జీలుగ పైరు

వేటపాలెం: ఆధునిక వ్యవసాయంలో ఎరువులు, పురుగు మందులు వాడకం ఎక్కువడంతో భూసారం మరింత క్షీణతకు గురవుతోంది. పంటకు అవసరమైన పోషకాలు అందించేందుకు 80 శాతం మంది రైతులు రసాయన ఎరువుల పైనే ఆధారపడుతున్నారు. వీటితో దిగుబడి ఆశాజనకంగా ఉంటున్నా భూమి సారాన్ని కోల్పోతోంది. పంటల్లో పురుగులు, తెగుళ్ల బారిన పడేందుకు అవకాశాలే ఎక్కువ. దీంతో రైతులకు సాగు ఖర్చు పెరగడంతో పాటు గాలి, నీరు, భూమి, పంట ఉత్పత్తులు రసాయనాల బారిన పడుతున్నాయి. ఈదశలో వ్యవసాయంలో పచ్చిరొట్ట పైర్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. భూమిలో కలియదున్నడం వలన భూసారాన్ని పెంచుకోవచ్చని వ్యవసాయాధికారులు తెలియజేస్తున్నారు. జనుము, జీలుగ, పిల్లిపెసర వంటి విత్తనాలను ప్రభుత్వం 50 శాతం రాయితీపై అందిస్తోంది.

అందుబాటులో విత్తనాలు..

మండల పరిధిలో 16 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా రైతులకు పచ్చి రొట్ట విత్తనాలను పంపిణీ చేసేందుకు వ్యవసాయ అధికారులు సిద్ధంగా ఉన్నారు. ముందుగా రైతులు ఆధార్ కార్డులు తీసుకొని రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకుని వారికి కావాల్సిన విత్తనాలను ఆర్డర్ చేసుకోవాలి. మండలానికి మే నెలలో 80 క్వింటాళ్లు పచ్చిరొట్ట విత్తనాలు రానున్నాయని వ్యవసాయ అధికారులు తెలిపారు.

పుష్కలంగా పోషకాలు ..

వరి, ఆరుతడి, బోర్ల కింద సాగుచేసే భూముల్లో జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు వేస్తారు. నారుపోసి పొలం దున్నే సమయానికి అంటే 50–60 రోజుల్లో పంట పూతకు వస్తుంది. ఆ సమయంలో పొలంలో కలియ దున్నడం వలన వరి పంటకు కావాల్సిన ముఖ్య పోషకాలైన కాల్షియం, మెగ్నీషియం, సల్ఫర్, సూక్ష్మ పోషకాలు, జింక్, బోరాన్, ఇనుము, మాంగనీస్ వంటివి పుష్కలంగా అందుతాయి. భూమిలో కర్బన శాతం తగ్గి, నత్రజని శాతం పెరగుతుంది. కొద్దిమోత్తంలో రసాయన ఎరువుల వేసినా పంటకు ఉపయోగపడేలా చేస్తాయి. నీటి ఎద్దడి ఏర్పడినా తట్టుకునే శక్తి పెరుగుతుంది. పంటకు ఉపయోగపడే సూక్ష్మజీవుల సంఖ్య పెరగడమే కాకుండా పురుగులు, తెగుళ్ల బెడద ఉండదు.

సాగులో పాటించాల్సిన మెళుకువలు..

- పంట కోయగానే నేలలో మిగిలిన తేమను సద్వినియోగం చేసుకుని పచ్చిరొట్ట ఎరువులు విత్తుకోవాలి.
- తేమ చాలని ప్రాంతాల్లో వేసవిలో దుక్కి దున్ని తొలకరి వర్షాలు పడగానే విత్తుకోవాలి.
- నీటి వసతి కలిగిన ప్రాంతాల్లో వేసవిలో సాగు చేయడం లాభాదాయకం
- పసుపు, కంది, పంటల వరుసల మధ్య పచ్చిరొట్ట పెంచి పూత సమయంలో కలియదున్నాలి.
- రెండు పంటల మధ్య కాల వ్యవధితో విత్తుకొని కలియ దున్నుకోవచ్చు.

రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి..



పచ్చిరొట్ట ఎరువులతో తక్కువ ఖర్చుతో భూమికి ఎక్కువ పోషకాలు అందించవచ్చు. పచ్చిరొట్ట సాగులో జీలుగ, జనుము, పిల్లిపెసర ప్రాచుర్యంలో ఉన్నాయి. భూమిలో కలియదున్నిన తరువాత త్వరగా చీకుతాయి. ఆకుల్లో ఎక్కువ నత్రజని శాతం కలిగి ఉంటాయి. పర్యావరణం దెబ్బ తినకుండా ఉంటుంది. రసాయనిక ఎరువుల ఖర్చు తగ్గుతుంది. సబ్సిడీపై అందించే పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– ఐ కాశీవిశ్వనాథ్, ఏవో, వేటపాలెం

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- ఏపీటీఎఫ్ ఉపాధ్యాయుల నిరసన

అద్దంకిరూరల్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయులు కదం తొక్కారు. సోమవారం అద్దంకి ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జోన్ ఉపాధ్యాయులు తహసీల్దార్ శ్రీచరణ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అమర్తపూడి శేఖర్‌బాబు మాట్లాడుతూ ఏకరీతిన పదోన్నతులు, సీనియారిటి జాబితాల తయారీ, 11వ పీఆర్సీ ఆర్థిక బకాయిలు చెల్లించాలన్నారు. విద్యాబోధన తెలుగు, ఇంగ్లీషు మీడియాల్లో నిర్వహించాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మలాది నాగరాజు, అనపర్తి రమేష్‌బాబు, జీ. ఏలీషా, చెంచురామయ్య, కోటేశ్వరరావు, రాజశేఖర్, కోటయ్య నరసింహారావు పాల్గొన్నారు.



మార్టూరులో ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

9న జిల్లా, 14 రాష్ట్రస్థాయి ధర్నాలను జయప్రదం చేయాలి..

మార్టూరు: కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలతో పాటు ఉపాధ్యాయుల ఇతర సమస్యలు తక్షణం పరిష్కరించాలని ఏపీటీఎఫ్ మార్టూరు మండల శాఖ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలో వారు మాట్లాడారు. విద్యార్థుల జీరో ప్రవేశాల పాఠశాలలు ఈ ఏడాది మరింతగా పెరగడం ఆందోళన కలిగిస్తుందన్నారు. సీపీఎస్, జీపీఎస్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ మాడుగుల కిషోర్, జనరల్ సెక్రటరీ షేక్ జాన్ బాషా, జిల్లా కౌన్సిలర్ జయకుమార్, జిల్లా ఉపాధ్యక్షురాలు షేక్ ఇర్షాద్ పాల్గొన్నారు.



అద్దంకి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేట్టిన ఉపాధ్యాయులు

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

మార్టూరు: జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రెండు ప్రమాదాల్లో ఇద్దరు గాయపడ్డారు. అందిన వివరాల మేరకు.. మండలంలోని నాగరాజుపల్లి గ్రామానికి చెందిన వడ్లమూడి కాలేషా బైకుపై మార్టూరు నుంచి చిలకలూరిపేట వైపు వెళ్తున్నాడు. ఈక్రమంలో రాజుపాలెం సమీపంలోని ఎలవర్తి కోల్డ్ స్టోరేజ్ వద్దకు రాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో గాయపడిన కాలేషాను స్థానిక 108 సిబ్బంది చిలకలూరిపేట ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఇసుక దరిశి సమీపంలో..

జే పంగులూరు మండలం రామకూరు గ్రామానికి చెందిన కామేపల్లి జయకృష్ణ స్కూటీపై కోనంకి నుంచి మార్టూరు వైపు వస్తున్నాడు. ఇసుక దర్శి సమీపంలోని పెట్రోల్ బంకు వద్దకు రాగానే వాహనం అదుపుతప్పి జయకృష్ణ రహదారిపై పడి గాయపడ్డాడు. క్షతగాత్రుడని హైవే అంబులెన్స్ సిబ్బంది మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



జయకృష్ణను ఆసుపత్రికి తరలిస్తున్న హైవే సిబ్బంది

వీహెచ్‌పీ మండల శాఖ ఏర్పాటు

అద్దంకి రూరల్: బాపట్ల జిల్లా విశ్వహిందూ పరిషత్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శివన్నారాయణ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గీతామందిరంలో విశ్వహిందు పరిషత్ అద్దంకి మండల శాఖ ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా అన్నం రామనంద నాథ్, ఉపాధక్షుడిగా బొగ్గవరపు వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా గుంజి గోవిందు, ఉపకార్యదర్శిగా అన్నం లక్ష్మణ్‌కుమార్, కోశాధికారిగా తోట చంద్రశేఖర్, అర్చక ప్రముఖ్‌గా భాగవతుల సూర్యమాల కొండమాచార్యులు, భజరంగదళ్ ప్రముఖ్‌గా ముద్దంశెట్టి సాంబశివరావు, సేవా ప్రముఖులుగా మందలపు లక్ష్మీనారాయణ, త్రిపురభట్ల సుధాకర్‌ను నియమించారు. కార్యక్రమంలో మద్దుల వెంకటేశ్వర్లు, వాసుగురుస్వామి, కొండ్రగుంట శ్రీనివాసరావు, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు. త్వరలో గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలియజేశారు.



విశ్వహిందు పరిషత్ అద్దంకి మండల శాఖ సభ్యులు

అపరిశుభ్రంగా అంకమ్మ ఆలయ రోడ్డు



వ్యర్థాల్లో విహారం చేస్తున్న కుక్కలు

బల్లికురవ: మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామం నుంచి అంకమ్మ తల్లి ఆలయానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపుల వ్యర్థాలు పడవేయటంతో అపరిశుభ్రంగా ఉంది. గ్రామంతోపాటు పరిసర గ్రామాల్లోని భక్తులు మంగళ, శుక్ర, ఆదివారాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు ఈ రోడ్డు గుండానే వెళ్తారు. గ్రామంలోని రైతులు పండించిన పంటలను మార్కెట్‌కు తరలించాలన్నా, వ్యవసాయ పనులకు కూలీలను తీసుకెళ్లాలన్నా ఈరోడ్ మీదే వెళ్లాలి. వ్యర్థాల కుప్పలతో ఈ రోడ్డును కుక్కలు అడ్డాగా మార్చుకుని స్వైరవిహారం చేస్తున్నాయని భక్తులు తెలిపారు. గ్రామ పంచాయితీ అధికారులు ఆలయానికి వెళ్లే రోడ్‌కు ఇరువైపుల వ్యర్థాలు వేయకుండా చర్యలతోపాటు కుక్కల స్వైరవిహారానికి అడ్డుకట్ట వేయాలని ప్రజలు, భక్తులు వేడుకుంటున్నారు.

దివ్యాంగుడికి కృత్రిమ కాలు అందజేత

చినగంజాం: దివ్యాంగుడికి జైపూర్ కృత్రిమ కాలును దాతలు అందజేశారు. చినగంజాంలోని మసీదు పేటకు చెందిన షేక్ గౌస్ బాషా ప్రమాదంలో ఎడమ కాలు కోల్పోయాడు. చీరాలకు చెందిన వలివేటి మురళీకృష్ణ వాసవీ అసోసియేషన్, అవోపా స్వచ్ఛంద సంస్థ ద్వారా గౌస్‌బాషాకు జైపూర్ కృత్రిమ కాలు సమకూర్చారు. చినగంజాంకు చెందిన భారత్ నిర్మాణ్ వలంటీర్ ఏకుమళై గోవిందస్వామి కాలును సమకూర్చేందుకు సంస్థతో సంప్రదించి స్వయంగా వెళ్లి తెచ్చి అతనికి అందజేశాడు. గోవింద స్వామి కృషిని పలువురు ప్రశంసించారు.



దివ్యాంగుడు బాషాకు కృత్రిమ కాలు అందజేస్తున్న గోవిందస్వామి

ఉద్యోగ విరమణ సహజం

పర్చూరు(చినగంజాం): పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో సహాయకుడిగా పనిచేస్తున్న గద్దెల శ్యాంసన్ ఉద్యోగ విరమణ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. యార్డు సిబ్బంది ఆధ్వర్యంలో యార్డు ఆవరణలో నిర్వహించిన ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆయనన్ను శాలువా కప్పి, పూలమాలతో ఘనంగా సత్కరించారు. శ్యాంసన్ నిస్వార్థ సేవలందించారని, మంచి వాడుగా గుర్తింపు పొందారని యార్డు కార్యదర్శి దేవరకొండ తిరుపతిరావు కొనియాడారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



శ్యాంసన్‌ను సత్కరిస్తున్న యార్డు సిబ్బంది

చిన్నారులు దేవుడి స్వరూపులు



ర్యాలీలో పాల్గొన్న సండే స్కూలు చిన్నారులు

చీరాల రూరల్: చిన్నారులు దేవుని స్వరూపులని.. వారిని చిన్నతనం నుంచే చదువుతో పాటు దేవుని సన్నిధిలో ఆధ్యాత్మికంగా నడిపించాలని రెవరెండ్ పిల్లి దేవదాసు అన్నారు. స్థానిక చర్చి కాంపౌండ్‌లోని సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చి (పెద్దచర్చి) ఆధ్వర్యంలో సోమవారం సండే స్కూలు చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. ముందుగా దేవదాసు, పోకూరి నానిబాబు, గిప్టి పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి చైర్మన్ దేటా అశోక్ కుమార్ మాట్లాడారు. ప్రతి ఏడాది క్రమం తప్పకుండా సండేస్కూలు చిన్నారులకు వొకేషనల్ బైబిల్ స్కూలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రెజరర్ పేర్లి ఆనంద్‌బాబు, పీసీసీ, ఎల్‌సీసీ, యూత్ సభ్యులు, స్త్రీల సమాజం, సంఘస్తులు పాల్గొన్నారు.

వైభవంగా రామ మందిరం ప్రారంభం

వేటపాలెం: కొత్తపాలెం రోడ్డు లోగల దత్త క్షేత్రంలో నూతనంగా నిర్మించిన రామ మందిరాన్ని ఎన్ఆర్ఐ కోడూరి కిరణ్ సోమవారం ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా కిరణ్ మాట్లాడుతూ దత్తక్షేత్రంలో పులువురి దేవుళ్లకు సంబంధించిన మందిరాల నిర్మాణాలు చేపట్టి భక్తులకు క్షేత్ర దర్శనం ఎంతో ఉపయోగంగా ఉండే విధంగా చూస్తున్న సభ్యులను అభినందించారు. అధిక సంఖ్యలో భక్తుల పాల్గొని స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ ప్రమీల దేవి, అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు, శివప్రసాద్, మురళీకృష్ణ, కోశాధికారి రంగనాయకులు, కోడూరి రామకృష్ణ, ప్రసాదరావు, హైమావతి, భువనేశ్వరి, శైలజ, అనంతలక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.



ప్రారంభించిన రామ మందిరం

రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ఇంకొల్లు(చినగంజాం): రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఇంకొల్లు మండలం పావులూరు గ్రామంలో గాదె వీరారెడ్డి ప్రీమియర్ లీగ్ సీజన్–1ను సోమవారం వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి బందారు ప్రభాకరరావు ప్రారంభించారు. పలు జిల్లాల నుంచి పలు క్రికెట్ జట్లు పోటీలకు హాజరయ్యాయి. పోటీలలో మొదటి, మూడో బహుమతి సాధించిన జట్లుకు వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి రూ.30 వేలు, రూ.15 వేలు నగదు బహుమతి అందివ్వనున్నారు. రెండో బహుమతి రూ.20 వేలు పులఖండం రామకృష్ణారెడ్డి, నాలుగో బహుమతి రూ.10 వేలు కంది అంజిరెడ్డిలు అందజేయనున్నారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతిని గ్రామ సర్పంచ్ బొల్లెద్దు లుధియమ్మ, బాల్ స్పాన్సర్‌లు నక్కలపాలెం గ్రామ సర్పంచ్ రావిపూడి వేణుబాబు, షీల్డ్ స్పాన్సర్‌లు కంచర్ల అంజయ్యలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రారంభోత్సవం రోజున బూదవాడ–నక్కలపాలెం మధ్య మ్యాచ్ నిర్వహించగా, బూదవాడ క్రికెట్ జట్టు విజయం సాధించింది.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రభాకరరావు, సర్పంచ్ లుధియమ్మ

సూక్ష్మ కళాకారిణికి మహిళల అభినందనలు

కారంచేడు: సూక్ష్మ కళాకారిణిగా పేరొందిన మండలంలోని స్వర్ణ గ్రామానికి చెందిన అన్నం మహితను గ్రామానికి చెందిన ఆర్యవైశ్య సంఘ మహిళలు సత్కరించారు. మహిత గతంలో అనేక మంది జీవిత చరిత్రలను పెన్సిల్ మొనలపై చెక్కి, అనేక మంది అభిమానాన్ని, ప్రశంసలు అందుకున్నారు. ఈ క్రమంలో మహిత వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి చరిత్రతో పాటు, ఆర్య, వైశ్యుల 120 గోత్ర నామాలను ఆమె పెన్సిల్ మొనలపై చెక్కింది. ఈ పెన్సిల్ మొనలను ఆమె ఆర్య, వైశ్య సంఘం నాయకుల ఎదుట సోమవారం ప్రదర్శించింది. దీంతో మహితను ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళలు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈనెల 7వ తేదీన పెనుగొండలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈ కళాకండాన్ని బహూకరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్య, వైశ్య సంఘం నాయకులు, అన్నం నరశింహారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మహితను సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘు మహిళలు

సీసీ రోడ్డు నిర్మించాలని వినతి

కారంచేడు: సంపన్నుల గ్రామంగా పేరొందిన కారంచేడు ఎన్‌టీఆర్ నగర్ కాలనీలో సుమారు 100 కుటుంబాలు ఎస్టీలు (యానాదులు) నివాసముంటున్నారు. ఈ కాలనీ ఏర్పడి సుమారు 30 సంవత్సరాలు దాటింది. పాలకులు మారారు, అధికారులు వస్తున్నారు పోతున్నారు.. అయినా మా కాలనీలో నేటికి సీసీ రోడ్లు లేని ప్రాంతాలున్నాయని కాలనీ వాసులు సోమవారం స్థానిక గ్రీవెన్స్‌లో అర్జీలు పెట్టారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు జీ నాగరాజును కలసి వారు వినతి పత్రం అందించారు. తమ కాలనీకి అవసరమైన సీసీ రోడ్లు లేకపోవడం వలన కొద్దిపాటి వర్షానికి కూడా రహదారులు బురదమయంగా మారుతున్నాయని వారు వాపోయారు. వర్షం పడినప్పుడు పత్రికల్లో వచ్చిన వార్తలతో పంచాయతీ సిబ్బంది వచ్చి నీటిని పంపింగ్ చేస్తున్నారు గాని శాశ్వత పరిష్కారం చూపడం లేదని వారు వాపోయారు. వర్షాలు కురుస్తుండటంతో వృద్ధులు, చిన్నారులు, మహిళలు, ముఖ్యంగా గర్భిణులు చాలా ఇబ్బందులు పడుతున్నారని వారు వాపోయారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తమ కాలనీ ప్రజల సమస్యలను పరిష్కరించేలా సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందించిన కాలనీవాసులు

గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలు



చీరాలలో జనరల్ నాలెడ్జ్ అంశాలు వివరిస్తున్న ఉపాధ్యాయులు



సంతమాగులూరులో వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు

చీరాల అర్బన్: బాల్యం నుంచే పిల్లలను గ్రంథాలయాలకు వెళ్లేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని జిల్లా సైన్స్ కో–ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి సోమవారం అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో సమయం వృథా చేయకుండా చిన్నారులు ప్రతిరోజూ గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు చదివితే విజ్ఞానాన్ని సముపార్జించుకోవాలన్నారు. ఇంగ్లిషు ఉపాధ్యాయుడు షేక్ కమల్‌బాబు విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిషు తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ డీ ధనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సంతమాగులూరు (అద్దంకి రూరల్): విద్యార్థులు పుస్తకం చదవడం అలవాటు చేసుకోవాలని సంతమాగులూరు లైబ్రేరియన్ బాదం విజయభాస్కర రెడ్డి అన్నారు. సంతమాగులూరు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించి విద్యార్థులచే పుస్తకాలు చదివించారు.